# పరపతి

ఆఫీస్ స్టాఫ్ చేత సొంత పని, ఇంటిపని చేయించుకోవడానికి వినోద్ ఎంత వ్యతిరేకైనా కొన్ని సందర్భాల్లో వారి హెల్ప్ లేకుండా పని జరగడంలేదు.

వినోద్ ఆ ఊరు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి ఆఫీసులో రెండు రోజుల క్రితమే జాయిన్ అయ్యాడు. అర్జంటుగా గ్యాస్ కనెక్షన్, స్పేరు సిలిండర్ కావాలని అతని భార్య సునీత చెప్పింది.

యుడిసి కన్నారావుకి ఊర్లో మంచి పరపతి ఉందని ఇటువంటి పనులు అతనివల్లే సాధ్యమవుతాయని తెల్సుకుని అతడ్ని తన కేబిన్‌లోకి పిలిపించి విషయం చెప్పాడు వినోద్.

ఆఫీసర్ చెప్పిందే తడవు వెంటనే బయలుదేరి వెళ్ళి పని సాధించుకొచ్చాడు.

"సార్! స్పేర్ సిలిండర్ ఇంటివద్ద మేడమ్‌గారికి అప్పగించేను. మీ రేషన్ కార్డు మా వీధిలో రేషన్ డిపోకి ట్రాన్స్‌ఫర్ చేయించి షుగర్ కోటా తీసుకుని ఇంట్లో ఇచ్చాను" అన్నాడు కన్నారావు వినయంగా.

అతను చేసిన సహాయాన్ని ఎంతో మెచ్చుకున్నాడు వినోద్.

కన్నారావుని భార్య సలహామేరకు ఓ రోజు బట్టలు కొనడానికి తమతో బాజరుకి తీసుకువెళ్ళి మంచి షాపు చూపించమన్నాడు వినోద్.

కన్నారావు వారిని స్వరూప సిల్క్ హోమ్‌కి తీసుకువెళ్ళ ప్రొప్రైటర్‌కి పరిచయం చేసాడు. ప్రొప్రైటర్ వాళ్ళని లోపల ఎసి రూమ్‌లో కూర్చోబెట్టి కూల్‌డ్రింక్స్ ఇచ్చి వారికి కావాల్సిన బట్టలు తెప్పించి చూపించాడు. వారికి కావాల్సిన చీరలు, సూటింగ్స్, షర్టింగ్స్ సావకాశంగా సెలెక్ట్ చేసుకున్నారు. బిల్లు ఎనిమిది వేలైంది. కన్నారావు ప్రొప్రైటర్‌తో చెప్పి వాటికి టెన్ పర్సంట్ డిస్కౌంట్ ఇప్పించాడు.

కన్నారావు పరపతివల్ల తమకు విఐపి ట్రీట్‌మెంట్‌గాక పదిపర్సంట్ డిస్కౌంట్ కూడా వచ్చినందుకు ఎంతో ఆనందించారు వినోద్, అతని భార్య.

మర్నాడు ఉదయం సునీత ఫ్రెండ్ సౌందర్య గుడిలో కనిపిస్తే ఇంటికి తీసుకువచ్చింది.

సౌందర్య చీరల సెలెక్షన్‌లో ఎక్స్‌పర్ట్. ఎవరికి ఏ చీర బాగుంటుందో ఏ చీరకు ఏ బోర్డరు బావుంటుందో చక్కగా చెబుతుంది. కొన్న చీరలు ఆమెకి చూపించి "మావారి ఆఫీసులో పని చేసే కన్నారావు పరపతివల్ల మాకు రూ. 800 లాభం" అంది గర్వంగా.

"సునీతా! ఆ స్వరూప సిల్క్ హోమ్ మాదే. అంతేకాదు ఆ కన్నారావు మా ఏజెంటు. ఏజెంట్‌తో వచ్చిన వారి బిల్ 15 శాతం ఎక్కువేసి, కొన్నవారికి 10 శాతం, ఏజెంటకు 5 శాతం ఇస్తాము. ఇది మా ట్రేడ్ సీక్రెట్. ఫ్రెండువని చెప్పాను. అతని పరపతి ఏంకాదు" అన్న సౌందర్య మాటలకు నిర్ఘాంతపోయింది సునీత.

**(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 17-7-1997)**